ప్రజాశక్తి
మంగళవారం 11 ఫిబ్రవరి 2025
5
విజయనగరం



పోక్సో కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

పూసపాటిరేగ పోలీసుస్టేషన్లో గత ఏడాది నవంబర్ నమోదైన పోక్సో కేసులో నిందితుడు పెదపతివాడ గ్రామానికి చెందిన మైనపు హరీష్ (19)కు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 7ఏళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. హరీష్ అదే గ్రామానికి చెందిన బాలికపై 2024 నవంబరు 11న లైంగిక దాడికి పాల్పడినట్లుగా ఆ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూసపాటిరేగ ఎస్ఐ ఐ.దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారన్నారు. ఈ కేసులో నిందితుడిని ఎస్ఐ దుర్గా ప్రసాద్ అరెస్టు చేసి, కేవలం 17 రోజుల వ్యవధిలోనే అభియోగ పత్రాలు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి
10 నామినేషన్లు

- నేడు నామపత్రాల పరిశీలన
- 13 వరకూ ఉపసంహరణ గడువు

నామినేషన్ వేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి (ఫైల్)

ప్రజాశక్తి - విశాఖ, విజయనగరం

ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల సమర్పణ గడువు సోమవారంతో ముగిసింది. చివరిరోజైన సోమవారం పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు నామినేషన్లు వేశారు. దీంతో మొత్తం నామినేషన్లు వేసిన వారి సంఖ్య పదికి చేరింది. నామినేషన్లు సమర్పించిన వారిలో యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, ఎపిటిఎఫ్ బలపరిచిన పాకలపాటి రఘువర్మ, పిఆర్‌టియు బలపరిచిన గాదె శ్రీనివాసులు నాయుడులతో పాటు కోసూరు రాధాకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, నూకల సూర్య ప్రకాష్, రాయల సత్యనారాయణ, పోతల దుర్గారావు, పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు ఉన్నారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఈ నెల 13తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. ఆరోజు నాటికి పోటీలో ఎంతమంది ఉన్నారనేది స్పష్టంకానుంది. ఈ ఉపాధ్యాయ స్థానానికి ఎన్నికల అధికారిగా విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వ్యవహరిస్తున్నారు.

ఓటర్లు.. 22,493 మంది

ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సోమవారం ప్రకటించారు. ఈ మేరకు ఉత్తరాంధ్రలోని 5 జిల్లాలలో కలిపి మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం వరకు ఓటర్లు నమోదు కావడానికి అవకాశం ఇవ్వడంతో 1300 మంది ఓటు కోసం కొత్తగా దరఖాస్తులు సమర్పించారు. వాటన్నింటినీ పరిశీలించి 938 మందిని అర్హులుగా నిర్ణయించారు. దీంతో ప్రారంభంలో 21,555 మందిగా ఉన్న ఓటర్ల సంఖ్య 22,493కి చేరింది. మొత్తం ఓటర్లలో పురుషులు 13, 508 మంది కాగా మహిళా ఓటర్లు 8985 మంది ఉన్నారు.

జిల్లాల వారీగా చూస్తే..

శ్రీకాకుళం జిల్లాలో 5035 మంది, విజయనగరంలో 5223 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 1488 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1488 మంది, విశాఖపట్నం జిల్లాలో 5529 మంది, అనకాపల్లి జిల్లాలో 2825 మంది ఉన్నారు. ఐదు జిల్లాల్లో కలిపి 123 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. జిల్లాల వారీగా చూస్తే శ్రీకాకుళం జిల్లాలో 31, విజయనగరం జిల్లాలో 29, పార్వతీపురం మన్యం జిల్లాలో 15, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విశాఖపట్నం జిల్లాలో 13, అనకాపల్లి జిల్లాలో 24 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.

ఎస్‌జిటిలకు ఓటు హక్కు కల్పించాలి

విజయనగరం టౌన్ : ఉపాధ్యాయ శాసన మండలి నియోజక వర్గ ఎన్నికల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఓటు హక్కు కల్పించేలా శాసన సభ లో తీర్మానం ప్రవేశ పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. సోమవారం నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.భాస్కరరావు, వి.రమణ మాట్లాడుతూ ఉన్నత పాఠశాల, అంతకంటే పై స్థాయి లో పని చేసే ఉపాధ్యాయులకు మాత్రమే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటు హక్కు ఉండేలా 1950లో చట్టం చేశారన్నారు. ఆ కాలం లో ప్రాథమిక పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుల విద్యార్హత చాలా తక్కువగా వుండేదని అన్నారు. ప్రస్తుత ప్రాథమిక పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుల విద్యార్హతలు అధికంగా వున్నాయని, మారుతున్న కాలంతో పాటు చట్టాలు కూడా మారుతున్నా ఈ చట్టంలో మాత్రం మార్పు తీసుకురాలేదని తెలిపారు. కావున ఎస్‌జిటిలకు ఓటు హక్కు కల్పించేలా శాసన సభలో తీర్మానం చేయాలని కోరారు.

రైతు ప్రయోజనాలే ముఖ్యం

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ● తోటపల్లి కాలువ, సమీపంలోని గనుల పరిశీలన

గనులను పరిశీలిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-గరివిడి రూరల్

రైతుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పష్టం చేశారు. దేవాడ నుంచి దిగువనున్న సుమారు 28 వేల మంది రైతుల భూములకు సాగునీరు అందిస్తున్న తోటపల్లి కాలువ నుంచి నీటి లీకేజీకి అడ్డుకట్ట వేయాలని సూచించారు. గరివిడి మండలం దేవాడ గ్రామం వద్దనున్న తోటపల్లి కాలువను, దాని పక్కనే ఉన్న మాంగనీస్, ఐరెన్ ఓర్ గనులను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. తోటపల్లి కాలువ నుంచి సాగునీరు సమీపంలోని గనుల్లోకి లీకేజ్ అవుతుండటంతో, ఇటు నీరు వృథా అవ్వడంతోపాటు, అటు మైనింగ్ కూడా అంతరాయం కలుగుతుండటంతో కలెక్టర్ పరిశీలించారు. కాలువ నుంచి నీరు లీకేజ్ కాకుండా తీసుకోవలసిన చర్యలపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. మైనింగ్ కు సంబంధించిన అంశాలను గనుల శాఖ అధికారులతో, లీజు దారులు ఆర్‌బిఎస్ఎడి అండ్ కేఎన్ దాస్ కంపెనీ యజమానులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత మ్యాపులను, ప్రస్తుత కాలువ వెళ్తున్న మార్గాన్ని, గుర్ల మండలం సదానంద పురం గ్రామ పరిధిలో ఉన్న గనుల లోపలి ప్రాంతాన్ని, నీటి ఊటలను, మైనింగ్ మెటీరియల్ డంప్ లను పరిశీలించారు. లీకేజ్ ను అరికట్టడానికి తీసుకోవలసిన చర్యలపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేవాడ నుంచి దిగువ ప్రాంతాల్లో సుమారు 28 వేలమంది ఆయుకట్టు రైతులు ఉన్నారని, వారందరికీ సాగునీటిని సక్రమంగా అందించాల్సిన బాధ్యత తమపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. దీనినీ దృష్టిలో పెట్టుకొని నీటి లీకేజ్ జరగకుండా, గనుల్లోకి నీరు వెళ్లకుండా సుమారు 100 మీటర్ల వరకు కాలువలో కాంక్రీట్ ఫ్లోరింగ్, పక్క గోడలను నిర్మించాలని కలెక్టర్ సూచించారు. ఈ పనులను రెండు నెలల్లో పూర్తిచేసి, ఖరీఫ్‌కు నిరందించడానికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి కాలువ మార్గాన్ని కొద్దిగా మార్పు చేయాలని, మైనింగ్ కు లీజుకు ఇచ్చిన స్థలంలోనే, 80 అడుగుల కాలువ తవ్వాలని, అక్కడి కాలువ ఒడ్డు నుంచి గనుల వరకు వంద అడుగుల స్థలాన్ని విడిచి పెట్టాలని సూచించారు. ఈ మేరకు ఇరిగేషన్, మైనింగ్ అధికారులు కలిసి చర్చించి ప్రతిపాదనలు రెండు రోజుల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి మైనింగ్ కు అనుమతి పొందిన గని యజమానులు కూడా నష్టపోకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. పర్యటనలో చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణి, ఇరిగేషన్ ఎస్ఇ స్వర్ణకుమార్, మైనింగ్ డిడి సి.మోహన్రావు, రెండు మండలాల తాహశీల్దార్లు సిహెచ్ బంగార్రాజు, ఆదిలక్ష్మి, ఇరిగేషన్ డిఇలు, రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బంది, గనుల లీజ్ దారులు పాల్గొన్నారు.

క్వారీ పేలుళ్లతో బీటలు వచ్చిన గోడలను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా నాయకులు కె.సురేష్, జి.అప్పారావు

పేదల ప్రాణాలు లెక్కలేదా?

అధికారులు స్పందించకుంటే పోరాడుతాం : సిపిఎం

ప్రజాశక్తి - జామి

పేదల ప్రాణాలన్నా... వారి నివాసాలన్నా అధికారులకు లెక్క లేదా అని సిపిఎం నాయకులు కె.సురేష్, గాడి అప్పారావు ప్రశ్నించారు. మాధవరాయమెట్ట కాలనీ వాసుల ఇబ్బందులపై ప్రజాశక్తిలో వచ్చిన కథనాలకు స్పందించిన వారు సోమవారం స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీని ఆనుకొని ఉన్న స్టోన్ క్రషర్ వలన దుమ్ము దూళీ వ్యాపించి అనారోగ్యం బారిన పడుతున్నామని వారంతా తెలిపారు. పలువురు శ్వాస సంబంధిత రోగాలతో బాధపడుతున్నట్లు తెలిపారు. బ్లాస్టింగులతో కాలనీ ఇళ్లు దెబ్బ దిన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. వచ్చే సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని, కాలనీవాసులంతా రావాలని తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేనా?

నాలుగేళ్లుగా ఎదురుచూపులు

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పేదలు కోరుతున్నది ఇక్కడే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేనా అని ఎదురు చూస్తున్నారు. గత వైసిపి హయాంలో నగర పంచాయతీలో 1500 మందిని గుర్తించి వారికి ఇళ్ళ పట్టాలు మంజూరు చేసి రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణి చేశారు. అయితే కొండ ప్రాంతంలో ప్రభుత్వం ఇళ్ళ స్థలాలు కేటాయించడంతో అక్కడ ఎటువంటి సౌకర్యాలు లేక పోవడంతో ఆ స్థలాన్ని పట్టాలు పొందిన లబ్దిదార్లు తిరస్కరించారు. ఇందులో 62 మంది లబ్దిదార్లకు మండల పరిషత్ కార్యాలయం వద్ద పంప్ హౌస్ వెనుక ఇళ్ళ నిర్మాణం చేశారు. మిగతా 1400మందికి మాత్రం రిజిస్ట్రేషన్ పత్రాలు తప్ప స్థలం మాత్రం దక్కలేదు. కాగా పలుమార్లు అధికార్లు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్ళి గత 5 సంవత్సరాలుగా మొరపెట్టుకున్నా ఫలితం మాత్రం కనిపించలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఇప్పటికైనా రిజిస్ట్రేషన్ పత్రాలు పొందిన వారికి న్యాయం జరుగుతుందని ఇళ్ళ స్థలాలు చూపిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు. పూడమ్మ వనం వద్ద సర్వే నెంబర్316లో(ఎల్‌సిసి ల్యాండ్) ప్రభుత్వ మిగులు భూమి 45 ఎకరాల ఉందని అందులో పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లారు. అయితే గత సంవత్సరం మాజీ ఎమ్మెల్యే కూడా ఇదే స్థలంలో కొంత భూమిని సదరు రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చిన వారికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి అయినా సరే పేదలకు ఇచ్చిన పట్టాలను పరిగణలోకి తీసుకుని ఇళ్ల స్థలాలు కేటాయించాలని పేదలు కోరుతున్నారు.

జ్యూట్‌మిల్లు తెరిపించకుంటే ఆందోళన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జ్యూట్‌మిల్లును తెరిపించకపోతే ఆందోళన తప్పదని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు హెచ్చరించారు. సోమవారం విశాఖపట్నం లేబర్ కమిషనర్ వద్ద జ్యూట్ మిల్లు సమస్యపై చర్చలు జరిగాయి. ఈ చర్చలకు జ్యూట్ కార్మిక సంఘాల నాయకులు, జ్యూట్ కమర్షియల్ మేనేజర్ పంకజ్ రాఠీ హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యూట్ మిల్లు తెరిపించాలని, సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం రామారావు మాట్లాడుతూ జ్యూట్‌మిల్లు లాక్ ఔట్ చేసి 9 నెలలు గడిచిందని, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జ్యూట్ యాజమాన్యం ఇఎస్ఐ, పిఎఫ్ బకాయిలు ప్రభుత్వ వాటా చెల్లించకపోవడం వల్ల పని చేస్తున్న కార్మికులకు ఇఎస్ఐ డిస్పెన్సరీ నుంచి వైద్య పరమైన సేవలు, అనారోగ్యంతో వున్నవారికి సెలవులు మంజూరు కావడం లేదన్నారు. పిఎఫ్ బకాయిలు చెల్లించకపోవడంతో పింఛన్ సౌకర్యం, గ్రాడ్యూటీ బకాయిలు రిటైర్డ్ కార్మికులకు అందడం లేదన్నారు. కాగా 1989 నుంచి జ్యూట్ యాజమాన్యం కార్మికుల నుంచి 5,10,18రూపాయలు అప్పుగా తీసుకొని ఇంతవరకు ఇవ్వలేదని, ఒక్కొక్కరికీ రూ.52వేలు యాజమాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జ్యూట్‌మిల్లు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించడంతో బాటు కార్మికులు, రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాకాని పక్షంలో కార్మికులతో ఉద్యమం చేపడతామని హెచ్చిరించారు. ఈ నెలాఖరులో, వచ్చే నెల మార్చి మొదటి వారంలో మిల్లును తెరిపించాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఐఎఫ్‌టియు నాయకులు నామాల తిరుపతి రావు, శ్రామిక సంఘం నాయకులు బేతా అప్పారావు ఉన్నారు.

శ్రీరామ్మూర్తి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు

కథా రచయిత శ్రీరామ్మూర్తి మృతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరానికి చెందిన ప్రముఖ కథా రచయిత పిబివి శ్రీరామ్మూర్తి మరణించారు. 1969 కృష్ణా పత్రికలో 'పాపం శైలజ' కథతో శ్రీరామ్మూర్తి సాహిత్య ప్రస్థానం ప్రారంభమైంది. 300కు పైగా కథలు, ఆరు నవలలు ఆయన రచించారు. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఉత్తమ ఉపాధ్యాయులుగా అనేకమంది మన్ననలు పొందారు. సోమవారం ఆయన నివాసానికి రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు వెళ్లి, పార్థీవదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విజయనగర సాహితీ రంగంలో శ్రీరామ్మూర్తి లేనిలోటు తీర్చలేనిదని డివిజి శంకరరావు కొనియాడారు. శ్రీరామ్మూర్తి మృతికి అరసం జిల్లా అధ్యక్షులు జిఎస్ చలం, కార్యదర్శి ఆర్.బాలకృష్ణ సంతాపం తెలియజేశారు.

14న సత్య కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 14న తోటపాలెంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో జాబ్‌మేళా జరుగుతుందని కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ ఎంవి సాయిదేవమణి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కళాశాలలో ఆవిష్కరించారు. యోకోహోమ టైర్స్, పెటిఎం, రక్షిత్ గ్రూపు ఆఫ్ ఫార్మా కంపెనీలతో ఈ క్యాంపస్ డ్రైవ్ జరుగుతుందని తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాల లోపు వయస్సు ఉండి 2021 నుంచి 25 విద్యా సంవత్సరాల మధ్య డిప్లమో, ఐటిఐ, బిఎస్‌సి, బికాం, బిఎ చదివిన వారుమాత్రమే అర్హులని తెలిపారు. రక్షిత్ గ్రూపు ఆఫ్ ఫార్మా కంపెనీలో ప్రొడక్షన్, ట్రైనీ కెమిస్ట్, క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అనలిస్ట్ విభాగాలలో పరవాడ, విశాఖపట్నంలో ఉద్యోగాల కోసం అభ్యర్థులు హాజరు కావచ్చునని తెలిపారు. బయోడేటా, సర్టిఫికెట్ జిరాక్సు కాపీలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో హాజరు కావాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఫోన్ నెంబర్లు 70132 93316, 90327 72661, 99630 69332, 70137 87725, 99267 17999 సంప్రదించాలని తెలిపారు.

సిఎంను కలిసిన ఎమ్మెల్యే కోళ్ల

ముఖ్యమంత్రికి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అమరావతిలోని సచివాలయంలో సిఎం చంద్రబాబునాయుడును సోమవారం శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లారు. కొత్తవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణానికి, శృంగవరపుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల అదనపు తరగతుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి అందించారు. వీటిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి.. నిధులు మంజూరు అయ్యేలా చూస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, ఎల్.కోట మండల అధ్యక్షులు చొక్కాకుల మల్లు నాయుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కరెడ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

సెట్విజ్ సిఇఒగా సోమేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా యువజన సర్వీసుల శాఖ సెట్విజ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా వయోజన విద్యా శాఖ ఉప సంచాలకులు ఎ.సోమేశ్వర రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం సిఇఒ గా వున్న రాంగోపాల్ తన మాతృశాఖకు వెళ్లడంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి సిఇఒ గా బాధ్యతలు చేపట్టారు.

కారులో తరలిస్తున్న గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-రామభద్రపురం

ఇటీవల మండల పోలీస్ స్టేషన్ సిబ్బంది చెక్ పోస్ట్ వద్ద అప్రమత్తంగా ఉంటూ చాక చక్యంగా గంజాయి తరలిస్తున్న ముఠా గుట్టు రట్టు చేస్తున్నారు. మండల పరిధిలోని కొట్టక్కి చెక్ పోస్ట్ వద్ద సోమవారం తెల్లవారు జామున జరిపిన దాడుల్లో 148 కేజీల గంజాయిని పట్టుకున్నారు. బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు తెలిపిన వివరాల మేరకు..ఒడిశా నుంచి విశాఖపట్టణం వైపు గంజాయిని తరలిస్తున్న కారును పోలీసులు చెక్ పోస్ట్ వద్ద నిలుపుదల చేయగా ఆ ముఠా వాహనాన్ని అతి వేగంగా తుప్పల్లోకి మళ్లించి అక్కడ వాహనాన్ని విడిచిపెట్టి పరారయ్యారు. ఆ వాహనాన్ని పరిశీలించగా తప్పుడు రిజిస్ట్రేషన్ నెంబర్ తో ఎపిలోకి వచ్చినట్లు కనుగొని వాహనాన్ని సోదా చేశారు. అందులో 74 ప్యాకెట లో సుమారు 148 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకొని కారును సీజ్ చేసి పోలీసు స్టేషనుకు తరలించారు. నిందితులను సాంకేతికత సహాయంతో త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. నైట్ రౌండ్ విధుల్లో ఉన్న ఎస్ఐ అప్పారావు చాకచక్యంగా వ్యవహరించి గంజాయి వాహనాన్ని నిలుపుదల చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ నారాయణరావు మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు అక్రమ రవాణాలో పట్టుబడితే చట్టం ప్రకారం కేసులు నమోదుచే స్తామని,నేరం రుజువైతే 20సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందని తెలిపారు. ఎస్ఐ ప్రసాదరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల ఔన్నత్యాన్ని పెంచాలి

కమిషనర్ నల్లనయ్య

మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అన్న క్యాంటీన్ల ఔన్నత్యాన్ని మరింత పెంపొందించే దిశగా సిబ్బంది కృషి చేయాలని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్న క్యాంటీన్లను పరిశుభ్ర వాతావరణంలో ఉండేలా అనునిత్యం పర్యవేక్షించాలని చెప్పారు. ఆహార పదార్థాలు శుచి, శుభ్రంగా, వేడిగా ఉన్నాయా లేదో గమనించాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రజాస్పందనను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. సచివాలయాల పరిధిలో రహదారులకు గుంతలు లేకుండా వెనువెంటనే పూడ్చివేయాలని తెలిపారు. రహదారుల పాక్షిక మరమ్మతులను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. తాగునీటిని వృధా చేయకుండా ఆన్ ఆఫ్ స్విచ్‌లను బిగించాలని చెప్పారు. ప్రతి 15 రోజులకోసారి వాటర్ ట్యాంకులను శుభ్ర పరచాలని ఆదేశించారు. అనంతరం హౌసింగ్ పై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ అంశాలను పరిగణనలోకి తీసుకొని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరయ్యే విధంగా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో డిఎలు శ్రీనివాసరావు, ప్రసాద్, గృహ నిర్మాణ సంస్థ డిఇ రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

బాబాను దర్శించుకునేందుకు వస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, దర్గాలో పూజలు చేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన

ముగిసిన ఖాదర్ బాబా సుగంధ మహోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

హజరత్ సయ్యద్ ఖాదర్ వలీ బాబా 66వ సుగంధ ఉరుసు మహోత్సవాలు సోమవారం దర్గాలో జరిగిన సలామ్, ఖుల్ షరీఫ్‌తో ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన సుగంధ ఉత్సవాల్లో దేశ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయనతోపాటు అనేక మంది ప్రముఖులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఖాదర్ బాబా దర్గా, దర్బార్ షరీఫ్‌కు విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా డాక్టర్ మొహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

గ్రీన్ అంబాసిడర్ల నిరసన

ప్రజాశక్తి-రామభద్రపురం

రాజకీయ వేధింపులు ఆపాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన గ్రీన్ అంబాసిడర్లు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఎంపిడిఒ రత్నాంరాణికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు మాట్లాడుతూ పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా నిత్య సేవలందించే వారిని వేధించడం తగదన్నారు. రాజకీయ నాయకుల ప్రలోభాలు, సొంత నిర్ణయాలతో కష్టపడి పనిచేస్తున్న ఏ ఒక్కరినీ తొలగించరాదని కోరారు. జిఒ నెంబర్ 680 ప్రకారం గ్రీన్ అంబాసిడర్లకు రూ.10 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే నేరుగా కార్మికుల అకౌంట్లో వేతనాలు జమ చేయాలని కోరారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, మరణించిన కార్మికుల పిల్లలకు ఉపాధి కల్పించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు కృష్ణ, పోలిరాజు, వెలగాడ సింహాచలం, వెలగాడ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో సౌకర్యాలు భేష్

పలువురు పారిశ్రామిక వేత్తలు వెల్లడి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయని పలువురు పారిశ్రామిక వేత్తలు వెల్లడించారు. పేద ప్రజలకు వైద్య సేవలందించేందుకు త్వరలో ఇక్కడ ఏర్పాటు చేయనున్న వంద పడకల ఆసుపత్రికి తనవంత చేయూతనిస్తానని ప్రముఖ పారిశ్రామిక వేత్త వసుద రామరాజు స్పష్టం చేశారు. సోమవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని ప్రముఖ పారిశ్రామిక వేత్తలు వసుద రామరాజు, శివ ప్రసాద్ రెడ్డి, జమిందార్ నర్సింహరాజు తదితరులు సందర్శించారు. ఇక్కడ ఎఆర్ విఆర్ ల్యాబ్, 3డి ప్రింటింగ్, గైరో ప్లేన్, ఇ-వాహనాలు తయారీ, కుట్టు యంత్రాల యూనిట్, డ్రోన్ల తయారీ, పరిశోధన యూనిట్, అనాటమీ ల్యాబ్, టిషు్య కల్చర్ యూనిట్ తదితర వాటిని పరిశీలించి అద్భుతంగా ఉన్నాయన్నారు. ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి వీరికి విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అందజేస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ సన్నీ డియోల్, డీన్ డాక్టర్ విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇపిఎఫ్ పింఛనుదారుల ధర్నా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇపిఎఫ్ పింఛనుదారుల ధర్నా జయప్రదం చేయాలని ఇపిఎఫ్ పింఛన్ దార్ల మండల నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అమర కార్మికుల భవనంలో వారు మాట్లాడుతూ ఈపిఎఫ్ పింఛన్ దార్లకు కనీస పింఛన్ ఇవ్వాలని కోరుతూ ఈ నెల 11న ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నా జిల్లా కేంద్రంలో పిఎఫ్ కార్యాలయం వద్ద జరుగుతుందని పింఛన్‌దార్లు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పరీక్షా పే చర్చలో డిఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం నిర్వహించిన పరీక్షపై చర్చా కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు పాల్గొన్నారు. స్థానిక కంటోన్మెంట్ హైస్కూల్లో విద్యార్థులతో పాటు ఆయన చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, ఉత్తమ ఫలితాల సాధనకు ఎటువంటి కృషి చేయాలనే అంశాలపై చర్చ జరిగింది. అనంతరం విద్యార్థులకు పరీక్షాపై చర్చా కార్యక్రమంలోని అంశాలను వివరించారు. అనంతరం అదే స్కూలులో జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షను పరిశీలించారు.

రైతులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రైతులకు భూ ఆధార్, ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరని ఎఒ ఎం.పూర్ణిమ అన్నారు. సోమవారం ఆమె చంద్రంపేటలో ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు నమోదు ప్రక్రియను పరిశీలించి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ పథకాలు సరైన లబ్ధిదారులను గుర్తించి పథకాలు వర్తింపచేయడానికి కొత్తగా భూ ఆధార్, ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం తీసుకు వచ్చారన్నారు. భూ ఆధార్ ఉన్న వాళ్ళకి పిఎంకిసాన్ వంటి పథకాలు వర్తింపజేస్తారని ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకొని భూ ఆధార్ ఐడి నెంబర్ పొందాలని తెలిపారు. రైతు నమోదుకి రైతు ఆధార్ కార్డు, పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నెంబర్ రైతు సేవాకేంద్రానికి తీసుకువెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు వేణు బాబు, రైతులు పాల్గొన్నారు.


సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన కెల్ల శంకరరావు అనారోగ్యంతో బాధ పడడంతో వైద్యానికి ఎమ్మెల్యే బేబినాయన సిఎం సహాయ నిధి చెక్కును అందించారు. కోటలో సోమవారం శంకరరావుకు రూ.37,100 చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శంకరరావు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు సీఎం సహాయ నిధి వరంగా ఉందని బేబినాయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పువ్వల మాధవరావు పాల్గొన్నారు

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల/గుర్ల

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా సోమవారం జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ జరిగిందని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి తెలిపారు. జిల్లాలోని జిల్లాలో 2 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు నులిపురుగుల నివారణ నిమిత్తము ఒక ఆల్బెండజోల్ మాత్ర మధ్యాహ్నం భోజనం తర్వాత ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం వలన పిల్లలలో ఉన్న నులిపురుగులు నశించి పిల్లలకు రక్తహీనత రాకుండా కాపాడుతుందని అన్నారు. స్థానిక రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులతో నులిపురుగుల నివారణ మాత్రలను డిఎంహెచ్‌ఒ మింగించారు. జిల్లాలో 3లక్షల 60, 869 మంది పిల్లలకు గాను 3లక్షల 54,805 మంది పిల్లలతో ఈ మాత్రలు మింగించినట్లు తెలిపాపు. కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో సిహెచ్‌ఒలు, ఎఎన్ఎంలు ఆశా కార్యకర్తలు ప్రతి స్కూలు ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

అనంతరం గుర్ల మండలంలో గూడెం గ్రామాలను సందర్శించి స్కూల్ లో జరుగుతున్న ఫైలేరియా నియంత్రణకు ఈనెల 10 నుంచి 27 వరకు మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమం ప్రారంభించారు. పిల్లలందరితో డిఇసి మాత్రలు మింగించారు. ఫైలేరియా వ్యాధి లక్షణాలు బయటికి రావడానికి 10 నుంచి 15 సంవత్సరాలు పడుతుందని, కావున ప్రతి ఒక్కరూ ఫైలేరియా నివారణ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని తెలిపారు.

వేపాడ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

జాతీయ నులిపురుగుల దినోత్సవం

లక్కవరపుకోట : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజరు పి.భాగ్యలక్ష్మి ఎఎన్ఎం కె.ఈశ్వరమ్మ, పి.హిమబిందుతో కలిసి ఆరు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. పిల్లలకు కడుపులో నులిపురుగులు ఉండడం వలన కడుపునొప్పి, నరాల బలహీనత, నీరసము ఉంటుందని ఆరోగ్య వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పి.దేవి, ఎం కృష్ణమ్మ, వి.అన్నపూర్ణ, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ కేశవరావు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్, పిహెచ్‌సి ఆధ్వర్యంలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పిల్లలకు రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు వస్తాయని వివరించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ భాస్కర్ రావు విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుల్లో రాణిస్తారని, అందుకు ప్రతి ఒక్కరూ నూలిపురుగులు మందులను తీసుకొని నివారించాలని కోరారు.

కొత్తవలస : ఆల్బెండజోలు మాత్రలతో రక్తహీనత మాయమవుతుందని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. పిహెచ్‌సి పరిధిలోని పాఠశాలలు, కాలేజీలు, అంగన్వాడీ కేంద్రాల్లో 4886 మంది పిల్లలకు ఆల్బెండజోలు మాత్రలే వేయించారు. వియ్యంపేట బిఆర్ అంబేద్కర్ గురుకులంలో ప్రిన్సిపాల్ టి. జయశ్రీ, జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.సాంబశివరావు ఆధ్వర్యంలో మాత్రలు మింగించారు. సూపర్ వైజర్లు, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రేగిడి : మండలంలోని బూరాడ, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 66 గ్రామాలలో సోమవారం వైద్యాధికారులు డాక్టర్ చలమయ్య, రీనా చౌదరి, చందక అసిరి నాయుడు ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోనూ, అంగన్వాడీ కేంద్రాల్లోనూ జాతీయ నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోలు మాత్రలు మింగించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి రాధాకృష్ణ, సూపర్‌వైజర్లు సావిత్రి, సాయి కృష్ణ, అప్పారావు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు..


విద్యార్థినితో అల్బెండజోల్‌మాత్ర మింగిస్తున్న డిఎంహెచ్‌ఒ జీవనరాణి

నెల్లిమర్ల : తంగుడుబిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా హెచ్‌ఎం రొంగలి సత్యం ఆధ్వర్యంలో గణిత ఉపాధ్యాయులు శివుకు బంగారయ్య విద్యార్థులకు మాత్రలు వేశారు. సతివాడ మోడల్ స్కూల్లో పిల్లలకు జిల్లా ఇమ్యునైజషన్ అధికారి డాక్టర్ అచ్యుత కుమారి, కెజిబివిలో ఎంపిడిఒ రామకృష్ణంరాజు, నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ యుఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ బి.ఉమా పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో 3989 మంది పిల్లలకు గాను 3909 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి ధరణి తెలిపారు. ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఎంఇఒలు ఎన్.నాగభూషణరావు, పి.బాల భాస్కరరావు, వైద్యులు ఎ.ధరణి, రమాదేవి, సిహెచ్‌ఒలు పాల్గొని, విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.

గజపతినగరం : మండలంలో 132 కేంద్రాల్లో 9982 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఒ బి.కళ్యాణి, ఎంఇఒ ఎస్.విమలమ్మ పర్యవేక్షించారు.

ప్రహరీ నిర్మాణం అడ్డగింత

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రావాడ పంచాయతీ గొల్లపేట పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను టిడిపి నాయకులు సోమవారం అడ్డుకున్నారు. ఈ పనులను గ్రామంలో ఉన్న తమకు కనీసం చెప్పకుండా జనసేన పార్టీ నాయకులతో చేస్తుండడంతో అడ్డుకున్నట్లు టిడిపి నాయకులు అమనాపు నారాయణరావు, అమనాపు శ్రీనివాసరావు పట్నాన అప్పలనాయుడు, బండారు సన్యాసిరావు, బండారు అప్పారావు, కనకల రామకృష్ణ తదితరులు తెలిపారు. ఆదివారం పనులు చేస్తుండటంతో సాయంత్రం అడ్డుకున్నామని దీనిపై మాట్లాడుతామని చెప్పిన జనసేన నాయకులు మళ్లీ సోమవారం ఉదయం పనులు ప్రారంభించడంతో అడ్డుకున్నామని తెలిపారు. ఎమ్మెల్యే గెలుపునకు తాము కూడా కష్టపడ్డామని, గ్రామంలో ప్రచారం నిర్వహించే అందరితో ఓట్లు వేయించామని, కానీ తమకు విలువ లేకుండా, గ్రామంలో జరుగుతున్న పనులు విషయం కూడా చెప్పకుండా జనసేన పార్టీ నాయకులకు పనులు కేటాయించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ ఉన్నప్పటికీ ఆయనకు కూడా కనీసం చెప్పలేదన్నారు. గతంలో ఉన్న ప్రహరీకి ఆనుకొని కాకుండా ఏకంగా రోడ్డుపైకి ప్రహరీ నిర్మిస్తూ ఉండడంతో రాకపోకలు కూడా తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని చెప్పారు. నాయకులు కూర్చుని ఈ పనులు ఎవరు చేయాలనే దానిపై నిర్ణయించాకే పనులు ప్రారంభించాలని, అంతవరకు పనులు అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు.

పనులను అడ్డుకుంటున్న టిడిపి కార్యకర్తలు

'ఎమ్మెల్యేకు అందరూ సమానమే'

ప్రజాశక్తి - జామి

శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి టిడిపి, వైసిపి అనే బేధం లేదని, గ్రామ అవసరాలు బట్టి అందరి సమస్యలు పరిష్కరిస్తూ వస్తున్నారని టిడిపి మండల నాయకులు వర్రి రమణ అన్నారు. సోమవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. జామి ఎల్లారమ్మ జాతర విషయంలో గ్రామ పెద్దలు అందరూ కలిసి కట్టుగా పండగ చేసుకోమని చెప్పారని, మండలంలో ఎటువంటి గ్రూపులు లేవని గొంప కృష్ణ, కోళ్ల అంటూ ఏమీ తేడాలు లేవని అన్నారు. సొంత పార్టీ వ్యక్తులను పక్కన పెడుతున్నారన్న వాదన సరియైనది కాదన్నారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మి, గనివాడ ఎర్నాయుడు, రాయవరపు శంకర్, కలగాడ రామకష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పరదేశిమాంబ జాతర ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో చినగుడిపాల గ్రామంలో పరదేశమాంబ జాతర సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. జాతర సందర్భంగా కోలాటాలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. మంగళవారం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నారు.

వృక్ష అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యోగాను అభ్యసించి పరిపూర్ణ మైన ఆరోగ్యాన్ని పొందాలని రెడ్ క్రాస్ యోగ శిక్షణ కేంద్రం గురువు ఆరి సుందరశివరాం పేర్కొన్నారు. ఈ కేంద్రం లో శిక్షణ పొందిన అభ్యాసకురాలు మజ్జి గౌతమి ఇటీవల బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి యోగోత్సవ' పోటీల్లో శిక్షకురాలుగా 'వక్ష అవార్డు', సాధనలో "ప్రతిభ అవార్డు' సాధించారు. ఆమె కుమార్తెలు తానీషా , తనిస్కాలు కూడా యోగా సాధన లో నిపుణత సాధించి 'ప్రతిభ అవార్డు' సాధించారు. వీరికి రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మెన్ కె.ఆర్.డి.ప్రసాద్, సెక్రటరీ సత్యం ఆధ్వర్యంలో సోమవారం గౌతమిని సత్కరించారు. ఈ సందర్భంగా సుందర శివరావు మాట్లాడుతూ రెడ్ క్రాస్ యోగా శిక్షణా కేంద్రం ద్వారా వందలాది మందికి శిక్షణ ఇచ్చామన్నారు.

పాడిరైతుకు గడ్డి కత్తిరించే యంత్రం

ప్రజాశక్తి-లక్కవరపుకోట

సోమవారం మర్లపల్లి గ్రామంలో సబ్బవరపు రాము అనే పాడి రైతుకు గడ్డి కత్తిరించే యంత్రాన్ని పశువైద్యాధికారి కోరాడ గాయత్రి పంపిణీ చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన గడ్డి యంత్రం రూ.33, 970 విలువ కాగా 40శాతం సబ్సిడీతో రూ.20, 382కు పాడిరైతుకు అందించినట్లు తెలిపారు.

కాలువలో పడిన ఆవు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక నాయుడు కాలనీలో ఆదివారం రాత్రి మురుగునీటి కాలువలో ఆవు పడిపోయింది. సోమవారం ఉదయం కాలువలో ఆవును గుర్తించిన స్థానికులు బయటకు తీసి కాపాడారు. పశువుల యజమానులు ఆవులను బయట విడిచి పెడుతున్నారని, అటువంటి వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

జనసేనలో పలు కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మండలంలోని కోరుకొండ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు వైసిపి నుంచి జనసేనలో చేరాయి. ఈ సందర్భంగా జనసేన నాయకులు గురాన అయ్యలు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో జనసేన కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా పనిచేయాలని కోరారు.

రోగులకు అవగాహన కల్పిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్

స్టెమీ పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి- గజపతినగరం

స్టెమీ పట్ల అప్రమత్తత అవసరమని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.జగదీష్ అన్నారు. సోమవారం ఆసుపత్రి ఆవరణలో రోగులకు అవగాహన కల్పించారు. స్టెమీ అనేది ఒకరకమైన గుండెపోటు అని, గుండె యొక్క దిగువ గదులను ప్రేరేపిస్తుందని,గుండె కండరాలను దెబ్బతీసి కావలసినంత రక్త ప్రసరణ జరగకుండా చేసి ఆకస్మిక గుండెపోటుతో మరణానికి గురి చేస్తుందని వివరించారు. ఎవరికైనా గుండెపోటు లక్షణాలు ఉన్నట్లు అనిపిస్తే వెంటనే అత్యవసర నెంబర్ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు చీదరించినా బుద్ధిరాలేదా? : టిడిపి

ప్రజాశక్తి-మెంటాడ

ప్రజలు చీదరించుకున్నా వైసిపికి బుద్ధి రాలేదని మండల టిడిపి నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో టిడిపి నాయకులు రెడ్డి ఎర్నానాయుడు, జి.ముసలినాయుడు , ఎస్.కృష్ణమూర్తి మాట్లాడారు. మంత్రి సంధ్యారాణి వాస్తవాలు మాట్లాడితే మాజీ మంత్రి రాజన్నదొర కు ఉలికుపాటెందుకని అన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు వైసిపిని వీడిపోతుంటే మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని అన్నారు. సాలూరు నియోజక వర్గంలో అభివృద్ధి పనులకు మంత్రి సంధ్యారాణి రూ.వంద కోట్లు కేటాయించారని తెలిపారు. ఇప్పటికే రూ.30కోట్లు విలువైన అభివృద్ధి పనులు జరిగాయని అన్నారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమిటో? ఎనిమిది నెలల టిడిపి ప్రభుత్వం అభివృద్ధి ఏమిటో చర్చించేందుకు సిద్ధామా అని సవాల్ చేశారు.

ఘనంగా రామలింగేశ్వర ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని నందిగం పంచాయతీ ఆవాల నందిగం గ్రామంలో శ్రీరామలింగేశ్వర ఆలయ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయం ఎంతో పురాతనమైనది కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో గత ప్రభుత్వం కొంత నిధులు కేటాయించగా పంచాయతీ పరిధిలోని గ్రామస్తులు కలిపి కొంత సొమ్ము వేసుకుని ఆలయాన్ని అందంగా నిర్మించుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో వేద పండితుల మధ్య ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్టించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చిన్నారులు పెద్దలు వేసిన కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది.

స్వచ్ఛాంధ్రపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-బొబ్బిలి

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి.. మెప్మా ఆర్‌పిలను ఆదేశించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్‌పిలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న ఇంటింటికీ తిరిగి తడి చెత్త, పొడి చెత్తలను వేరుచేసి మున్సిపల్ వాహనానికి అందించాలని ప్రజలను చైతన్య పరచాలని చెప్పారు. అందులో ప్రతి సచివాలయ పరిధిలో శానిటేషన్ సెక్రటరీలు, ఆర్‌పిలు బృందాలుగా ఏర్పడి ప్రచారం చేయాలని కోరారు. పిఎం సూర్యఘర్ పథకంలో భాగంగా కనీస 100 అడుగుల విస్తీర్ణం కలిగిన స్లాబ్ ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ యూనిట్లను నెలకొల్పి విద్యుత్ ఆదా చేయవచ్చునని తెలిపారు. అందుకు ప్రతి ఆర్‌పి 10 మందికి తక్కువ కాకుండా రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. వీరికి ప్రభుత్వ సబ్సిడీతోపాటు బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పిస్తారని చెప్పారు. టిపిఆర్‌ఒ జగన్మోహన రావు, సిఎంఎం లలిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, శానిటేషన్ సెక్రటరీలు, సిఒలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లాన్లపై అభ్యంతరాలుంటే చెప్పండి

మున్సిపాలిటీలో జారీ చేసిన సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లాన్లపై అభ్యంతరాలుంటే చెప్పాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. మున్సిపల్ కార్యాలయం, సచివాలయాలలో సోమవారం అనుమతులు పొందిన సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లాన్లను నోటీసు బోర్డులో పెట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పురాతన నిర్మాణాలున్న వీధులలో ఇరుకు రోడ్లు, జన సాంద్రత, నిర్మాణాల సాంద్రత ఎక్కువ ఉన్న ప్రాంతాలలో సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లాన్లకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని చెప్పారు. మున్సిపాలిటీలో 16 సచివాలయాల్లో ప్లాన్ల అనుమతులకు పంపగా 12 సచివాలయాలలో అనుమతి పొందాయని, ఆయా ప్లాన్లను సచివలయాలలో ప్రదర్శనకు పెట్టామని చెప్పారు. అభ్యంతరాలు ఉంటే వారం రోజుల్లో చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి రేవతి, సిబ్బంది పాల్గొన్నారు

ప్లాన్ కాపీలను సచివాలయంలో ప్రదర్శిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

'భీమసింగి' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జామి

భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు,ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి అన్నారు. ,సోమవారం భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద జరిగిన సమావేశంలో బాబ్జీ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన పనికిమాలిన చర్యల వలన ఉద్యోగులు, కార్మికులు, రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. గత ఐదేళ్లుగా ఫ్యాక్టరీ మూతపడ్డా కార్మికులకు రావలసిన పిఎఫ్, గ్రాట్యుటీ నేటికీ చెల్లించలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో జిల్లా నుండి మంత్రిగా బాధ్యత తీసుకున్న కొండపల్లి శ్రీనివాస్ కార్మికుల, ఉద్యోగుల, రైతుల సమస్యలపై దృష్టి సారించాలని, ఫ్యాక్టరీ మనుగడ పై ప్రభుత్వం తరపున మంత్రి శ్రీనివాస్ ప్రకటన చెయ్యాలనికోరారు,కార్మికులు, ఉద్యోగుల, పిఎఫ్, గ్రాట్యుటీ కోసం, ఫ్యాక్టరీ చైర్మన్ జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, సుగర్ కేన్ కమిషనర్ వి.వెంకటరావు,మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తో కార్మికులతో కలిసి సమావేశమై భవిష్యత్తు కార్యక్రమం ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులు ఉంగరాల శ్రీను,రౌతు కనకరాజు, విజయ్ కుమార్,సిరికి వెంకటరావు, బంగారయ్య, సూర్యనారాయణ, వర్రి శ్రీను, పిన్నింటి కృష్ణ, దేముడు తదితరులు పాల్గొన్నారు

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బాబ్జీ

U/O 21 RULE 66 NOTICE
IN THE HONOURABLE COURT OF JUNIOR CIVIL JUDGE, SRUNGAVARAPUKOTA
E.P.35/2024 in O.S. 49/2023.

Between:
Sri Bhumireddi Sattibabu, ...Plaintiff/DHR.
And:
Sri Gogada Ramakrishna,
.....Defendant/JDr.
TO.
Sri Gogada Ramakrishna s/o late Sanyasayya, Santhagavirampeta village, Srungavarapukota mandal in Vizianagaram dist.,

Whereas the above named petitioner has instituted the above petition against you U/O 21 rule 66 OF CPC and so you are here by noticed to appear in the above said court in person or by a pleader duly instructed and to answer all questions relating the above petition, on this day of **18-02-2025 at 10-00 A.M** in the above said court for your appearance, in the default of your appearance on above said date, the petition will be head and determined in your absence as exparty.

R. Satyanarayana.
Advocate.
Srungavarapukota (Vill & Md)
Vizianagaram Dist.,
Cell 9959234766

IN THE HONOURABLE COURT OF THE FAMILY JUDGE AT SRIKAKULAM
O.S: 4/2015

Between:-
Kolla Pardha saradha and 2 others
.....Plaintiffs
And :-
Satyavarapu Trinadha Murthy & others
.....Defendants
To,
D-7: Kolla Shirisha, W/o Gopala Krishna, Hindu, Aged 36 years, Employee, Residing at door No. 3-144, Saradhi village Rajam Mandalam and Panchayat, Srikakulam District.

It is to inform you that the above matter stands posted to on 14-02-2025 for your appearance .Hence you have to appear before the Honourable court on **14-02-2025 at about 10.30 AM.,** as in person or through an advocate without fail,otherwise the matter will be decided in your absence

// By order of the Honourable court//

BARATAM NAGESWARA RAO
Advocate for plaintiffs,
Srikakulam, Cell No: 9391380645

మహారాజశ్రీ విజయనగరం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయనగరం
IA : 667/2019 OS : 718/2019

Between:
గోలగాన అప్పయ్యమ్మ .....వాది
And:
కడియాల ఆదమ్మ మరియు వగైరాలు ...ప్రతివాదులు
To
D1. కడియాల ఆదమ్మ, W/o లేటు మారయ్య @ పండు, వయస్సు 70 సం॥, R/o కనపాక గ్రామం, విజయనగరం మండలం మరియు జిల్లా.
D2. కడియాల నారాయణ రావు, S/o లేటు మారయ్య @ పండు, వయస్సు 52 సం॥, R/o do-
D3. కడియాల శంకర్‌రావు, S/o లేటు మారయ్య @ పండు, వయస్సు 42 సం॥, R/o do-
D4. పడగల గంగులు, S/o లేటు ఆదప్ప, వయస్సు 50 సం॥, R/o do- తారకరామ కోలనీ, కనపాక గ్రామం, విజయనగరం మండలం మరియు జిల్లా.

పై నెంబరు గల దావాను వాదిగారు పై కోర్టునందు నమోదు చేయగా శ్రీ కోర్టువారు వాదిని ఆర్డరు జారీ చేసిన విధంగా ఈ నోటీసు పంపించడం జరిగినది. ఈ దావా **తేది 19-02-2025 ఉదయం గం॥ 10-30ని॥**లకు మీరుగాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టునకు హాజరై మీ వాదనను తెలియజేయవలెను. లేని ఎడల శ్రీ కోర్టువారు మీకు పరోక్షంగా తీర్మానించుదురు అని యిందు మూలంగా తెలియజేయడమైనది.

కె.రవిబాబు
అడ్వకేట్, విజయనగరం,
సెల్: 9440343921

మహారాజశ్రీ విజయనగరం 2వ అదనపు జూనియరు సివిలు జడ్జివారి కోర్టులో
OS : 545/2022

Between:
Paidisetty Sridevi ....Plaintiff
And :
Sudhagari Anant Rao.....Defendant
Notice to
Sudhagari Anant Rao, S/o Late SV Sarveswara Rao, Opp to Simhachalam Meda, Beside Andhra Childreen Hospital, Lanka Street, Vizianagaram.

పై నెంబరు దావాలో మీకు పై కోర్టువారి నుండి అనేకసార్లు నోటీసులు పంపినా మీరు తీసుకోనందున పై నెంబరు దావా మీకు నోటీసు నిమిత్తం తే 4-3-2025దీకి వాయిదా వేసెరి. పై దావాలో మీకు ఆక్షేపణలున్న ఎడల **తే 4-3-2025దీన ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో పై దావా మీ పరోక్షమందు తీర్మానించబడును.

ఇట్లు
J.Bheemasena Rao
Advocate for Plaintiffs/Petitioners,
Vizianagaram,
Cell: 9441053628